సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



ఏ నిమిషానికి ఏమి జరుగునో?

ఏ నిమిషానికి ఏమి జరుగుతుందోనని జిల్లాలో డీఎస్సీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



త్వరలోనే బుద్ధి చెప్పేరోజులు..

కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి సర్కారుకు త్వరలోనే బుద్ధి చెప్పే రోజులు వస్తాయని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. - 8లో



చెరువులోకి దూసుకెళ్లిన కారు

రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును తప్పించబోయి అదుపు తప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లింది. - 8లో

న్యూస్‌రీల్

రెండు రోజుల శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల హెచ్ఎంలకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 29, 30వ తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రీజినల్ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. శిక్షణకు ఎంపికైన హెచ్ఎంలు ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలలోపు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బోయకొండ పాలకమండలికి 115 దరఖాస్తులు



పాలకమండలి సభ్యత్వానికి దరఖాస్తు అందజేస్తున్న ఆశావహులు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యత్వానికి మొత్తం 115 మంది సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం గురువారం తెలిపారు. ఈనెల 27వ తేదీకు దరఖాస్తులు స్వీకరించడానికి చివరి గడువుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చివరిరోజు చిన్న ఓబునపల్లెకు చెందిన రాధ కూటమి నేతలతో కలిసి దరఖాస్తు అందజేసిందన్నారు. పాలకమండలిలో 13 మంది సభ్యులతోపాటు ఒక ఎక్స్ అఫిషియో సభ్యుడు ఉంటారని, పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో నియామకాలపై ఉత్కంఠత నెలకొంది.

నేడు.. రేపు సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన

చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలానికి సీఎం చేరుకుంటారు. రాత్రికి శాంతిపురం మండలం కడపల్లె గ్రామంలోని సీఎం నివాసంలో బస చేస్తారు. శనివారం కుప్పం మండలంలో పర్యటిస్తారు. పరమసముద్రం చెరువు వద్ద కృష్ణా జలాలకు జలహారతి ఇస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి బెంగళూరు మీదుగా తాడేపల్లె బయలుదేరి వెళతారు. సీఎం రాక నేపథ్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ కుప్పం పట్టణానికి చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రణామం..

పావన వనమాలి

చాలు.. చాలు.. ఈ జన్మకిది చాలు.. ఏమి రూపం.. అది ఎంత అపురూపం.. లిప్త కాలం పాటు దర్శించినా చాలు తరించు మా సప్త తరాలు!! కనుద్వయం కాంచినంతనే కడతేరు కటిక కష్టాలు! నిండైన నిను చూసినంతనే పులకించే మా మేను.. ముల్లోక వీర..మహిమాన్విత దేవా..గౌరీ తనయా.. ప్రథమ పూజల రాజా..వరలా వనమాలీ.. భక్త జన బాహుబలీ.. నమోనమామి.. మనసాస్మరామి.

- కాణిపాకంలో భక్తి శ్రద్ధలతో చవితి వేడుక
- వైభవంగా ధ్వజారోహణం
- పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ మంత్రి
- కిటకిటలాడిన వినాయకుని క్షేత్రం
- రెండు రోజులుగా ఆలయంలో భక్తుల సందడి



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు



బెండకాయలతో తయారు చేసిన వినాయకుని ప్రతిమ

కాణిపాకం: ఉమా సుతుని ఉత్సవ శోభకు తెర లేచింది. జయ, జయ ధ్వానాల నడుమ ధ్వజారోహణం అంగ రంగ వైభవంగా జరిగింది. బ్రహ్మదేవుడు ముందుండి మహాక్రతువును నిర్వహించారు. ఒక వైపు ఉదయం వేదపండితుల వేద మంత్రోచ్చారణలు, మరో వైపు లయబద్ధంగా బేరీనాథం, ఇంకోవైపు మంగళ వాయిద్యాలు కాణిపాక క్షేత్రంలో ఆధ్యాత్మికను వికసింపజేశాయి. వరసిద్ధుడి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. వేదపండితులు ధ్వజస్తంభంపై మూషిక చిత్రపటం ఎగురవేసి, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద దూప, దీప, నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉభయకర్తలు పాల్గొన్నారు.

హంసవాహనంపై అభయం

బ్రహ్మోత్సవాల్లో భాగంలో గురువారం రాత్రి వినాయకస్వామివారు హంసవాహనంపై అభయమిచ్చారు. ఉత్సవమూర్తిని సుగంధభరిత పుష్పాలతో శోభయామానంగా అలంకరించారు. అలాగే హంసవాహనాన్ని అలంకరించి ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఆ తర్వాత హంసవాహనంపై స్వామివారిని కొలువుదీర్చి, కాణిపాకం వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కర్పూరం, పసుప పళ్లెలతో హారతులు పట్టారు.

ఘనంగా చవితి ఉత్సవాలు

కాణిపాకంలోని స్వయంభువు వరసిద్ధి వినాయకస్వామి వారికి బుధవారం చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు, ప్రధాన అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ మూల విరాట్‌కు అభిషేకం చేశారు.

అనంతరం విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అభిషేకం, అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు స్వామివారి దర్శనం నిరంతరంగా కొనసాగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలు కిక్కిరిశాయి. వీఐపీ దర్శనం వైపు కూ డా భక్తులు క్యూకట్టారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. క్యూలో భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులు పుష్పకావళ్లను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఉత్సవమూర్తి మూషిక వాహనంపై విహారించారు. గ్రామోత్సవంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. కాగా ఆలయంలో పుష్పలంకారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను తీసుకువెళుతున్న మంత్రి, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు

వార్షిక బ్రహ్మోత్సవాలు, చవితిని పురస్కరించుకుని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామివారికి సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్ మోహన్, ఈఓ పెంచలకిషోర్ మేళతాళలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి పట్టువస్త్రాల సమర్పించారు. అనంతరం గణపతి వ్రతంలో పాల్గొన్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. కాణిపాకానికి వేద పాఠశాల తీసుకొస్తామని హామీ ఇచ్చారు.



మూషికవాహనంపై స్వామివారు



క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయంలో పుష్పాలంకరణ



పుష్పాలతో తీర్చిదిద్దిన వినాయకుడు

నదుల నిండా నీళ్లు..

మది నిండా కన్నీళ్లు

ప్రతి వర్షపు నీటి బొట్టునూ ఒడిసి పడుదాం.. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం.. ఇదీ చంద్రబాబు నాటి నుంచి నేటి వరకు ఇస్తున్న హామీ. బాబు ప్రకటనలకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికి పొంతనేలేదు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గంలోని పలు చిన్న, చిన్న నదులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సుమారు 200 ఎంసీఎఫ్‌టీల నీరు వృథాగా కడలిపాలు కావడమే నిదర్శనం. ఫలితం నదుల నిండా నీళ్లున్నా.. పడమటి వాసి మది నిండా కన్నీళ్లే మిగులుతున్నాయి.

వరద నీరు కడలి పాలు!

- జిల్లాలోని మిగులు జలాలు తమిళనాడు పాలు
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఏటా వర్షపు నీరు వృథా
- వడిసి పట్టలేక వదిలేస్తున్న నీరు 200 వందల ఎంసీఎఫ్‌టీలు
- ప్రాజెక్టుల నిర్మాణాలు ఎప్పటికో?
- పూర్తయితే పడమటి గడ్డ సస్యశ్యామలం
- గత ఎన్నికల్లో ప్రాజెక్టులు నిర్మిస్తామని మాటిచ్చిన బాబు



బైరెడ్డిపల్లె మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కైగల్ నది



పలమనేరు మండలం మండపేట కోటూరు అడవిలో ప్రవహిస్తున్న ఎరిగినేరు

పలమనేరు: జిల్లాలోని పడమటి గడ్డ పలమనేరు నియోజకవర్గంలో చిన్న, చిన్న నదులున్నా సాగు, తాగునీటికి ఈ ప్రాంతవాసులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. నేటికీ పలమనేరు నియోజకవర్గ వాసులు సాగు, తాగునీటికి బోర్లపైన ఆధారపడాల్సివస్తోంది. నియోజకవర్గంలోని చిన్న నదులు వర్షాలు కురిసిన సమయంలో మాత్రమే ప్రవహిస్తుంటాయి. ఈ నదుల నీటిని నిలిపి ఉంచే ప్రయత్నాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తుడడంతో నీరంతా వృథా అవుతోంది. కౌండిన్య నదిపై కాలువపల్లి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వైఎస్సార్ జలాశయాన్ని నిర్మించారు. ఆపై వచ్చిన కిరణ్, చంద్రబాబు ప్రభుత్వాలు నియోజకవర్గంలోని మిగిలిన ప్రాజెక్టుల విషయాన్ని గాలికొదిలేశాయి. గత ఎన్నికల్లో పలమనేరులో ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఇద్దరూ కూటమి అధికారంలోకి రాగానే ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మాటిచ్చారు. అయితే నేటికీ వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని నదుల నీరు వృథాగా పారుగునే ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని మోర్ధానా ప్రాజెక్టుకు చేరుతోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం సశ్యశామలమైనట్టే.


మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు గత ప్రభుత్వంలో చర్యలు

పలమనేరు నియోజకవర్గంలో కైగల్ నది ప్రాజెక్టు, దుర్గమ్మ ఏరు ప్రాజెక్టు, గంగన్నశిరస్సు ప్రాజెక్టుల నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ నదిపై రూ.22 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూనుకుంది. దీని నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు చెల్లింపులు జరిగి, టెండర్ల ప్రకియలో పనులు ఆగాయి. వి.కోట మండలంలోని దుర్గమ్మ ఏరు ప్రాజెక్టుకు రూ.46.82 కోట్ల అంచనాలను గతంలోనే ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపారు. పలమనేరు మండలంలోని గంగన్నశిరస్సు ప్రాజెక్టు పనులు గతంలో మొదలై అర్ధంతరంగా ఆగాయి. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్‌శాఖ రూ.27.37 కోట్ల కొత్త అంచనాలతో పబ్లిక్‌హెల్త్ శాఖకు పంపింది. అయితే అటవీశాఖ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతున్నందున ప్రాజెక్టుకు ఇబ్బందికరంగా మారింది. ఇక బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారిపల్లి నది విషయం కనీసం ఇరిగేషన్ శాఖకు కూడా తెలియదు. మొత్తం మీద ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయితే గంగనశిరస్సు ప్రాజెక్టులో 55 ఎంసీఎఫ్‌టీ, కైగల్ రిజర్వాయర్ ద్వారా 45.27 టీఎంసీ, దుర్గమ్మ ఏరు ప్రాజెక్టు ద్వారా 56 , వెంగంవారిపల్లి 40 ఎంసీఎఫ్‌టీ మొత్తం ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా 200 ఎంసీఎఫ్‌టీ దాకా నీటిని వడిసిపట్టినట్టే. దీంతో సాగు, తాగునీటి కష్టాలు తీరినట్టే.

200 ఎంసీఎఫ్‌టీ నీరు సముద్రం లోకే..

పలమనేరు నియోజకవర్గంలో కౌండిన్య, ఎగినేరి, కైగల్, దుర్గమ్మఏరు, వెంగంవారిపల్లి నదులు ముఖ్యమైనవి. వర్షాకాలంలో ఈ నదుల ప్రవహించినపుడు 150 నుంచి 200 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్లు)ల నీరు వృథాగా తమిళనాడు రాష్ట్రం ద్వారా బంగాళాఖాతంలో కలసిపోతోంది. అయితే కౌండిన్య నదిపై రూ. 55 కోట్ల వ్యయంతో పలమనేరు మండలంలోని కాలువపల్లి వద్ద దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వాయర్‌ను నిర్మించారు. దీంతో 50 ఎంసీఎఫ్‌టీల నీటిని ఇక్కడ నిల్వ చేసుకోగలిగాం. ప్రస్తుతం నదులకు ఎగువ ప్రాంతాలైన కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు కౌండిన్య నదిలో చేరి తమిళనాడులోని మోర్ధనా డ్యామ్‌కు వృథాగా వెళుతోంది. అలాగే పలమనేరు మండలంలోని ఎరగినేరి నది నీరు, వి.కోట మండలంలోని దుర్గమ్మ ఏరు నీరు తమిళనాడుకు చేరుతోంది. బైరెడ్డిపల్లి మండంలోని వెంగంవారిపల్లి అడవిలోని నదుల నుంచి ఏటా 200 ఎంసీఎఫ్‌టీ నీరు సముద్రం పాలవుతోంది.

గత ఎన్నికల్లో ప్రాజెక్టుల నిర్మాణానికి కూటమి హామీ



పలమనేరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న చంద్రబాబు(ఫైల్)

గత ఎన్నికల సందర్భంగా ఇక్కడికి వచ్చిన చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పలమనేరు నియోజకవర్గంలో ప్రాజెక్టులను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లు పూర్తి అయినా వీటి గురించి పట్టించుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు ఎక్కడ ఆగాయో అక్కడే ఉన్నాయి. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ అధికారులను(జేఈ లక్ష్మీనారాయణ)ను సంప్రదించగా గంగన్నశిరస్సు ప్రాజెక్టు పనులకు అటవీశాఖ నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉందన్నారు. కైగల్ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉన్నాయన్నారు. దుర్గమ్మ ఏరు ప్రాజెక్టుకు ఆర్థికశాఖ క్లియరెన్స్ రావాల్సి ఉందని తెలిపారు. రెండు ప్రాజెక్టులకు రివైజ్డ్ అంచనాలతో ఇటీవలే అంచనాలను పెంచి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులు త్వరగా మొదలుపెట్టేందుకు ఫాలోఅప్ చేస్తూనే ఉన్నామని పేర్కొన్నారు.

క్షుణ్ణంగా సర్టిఫికెట్ల పరిశీలన



ఎస్వీ సెట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న తిరుపతి డీఈఓ, డీఆర్‌డీఏ పీడీ

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను విద్యాశాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గురువారం అపోలో యూనివర్సిటీ, ఆర్‌వీఎస్ నగర్‌లోని ఎస్వీ సెట్‌లో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియ ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంపికైన అభ్యర్థులు ఆయా కేంద్రాలకు విచ్చేశారు. పరిశీలన కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. చిత్తూరు డీఈఓ వరలక్ష్మి, తిరుపతి డీఈఓ కేవీఎన్ కుమార్‌ల పర్యవేక్షణలో సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. వీరితో పాటు ప్రతి కేంద్రంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్ రెడ్డిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. వీరి పర్యవేక్షణలో సర్టిఫికెట్‌ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. ఫేక్ సర్టిఫికెట్‌ల కట్టడికి ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా అభ్యర్థుల సర్టిఫికెట్‌లను పరిశీలించారు.

మద్యం బార్ల లైసెన్స్‌లకు గడువు పెంపు

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం బార్లకు లైసెన్సులు జారీ ప్రక్రియకు మరో రెండు రోజులు గడువు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. లైసెన్సుల జారీకి శుక్రవారంతో దరఖాస్తుల గడువు ముగియనుంది. అయితే జిల్లాలోని ఏడు బార్లకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి.. దరఖాస్తులు ఆహ్వానించగా, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. గురువారం సాయంత్రానికి చిత్తూరులోని ఓ బార్‌కు నాలుగు దరఖాస్తులు, కుప్పంలోని బార్‌కు నాలుగు దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. మిగిలిన తొమ్మిది బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. చివరి రోజున ఒకటి, రెండూ బార్లకు దరఖాస్తు రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా 11 బార్లకు దరఖాస్తులు రానిపక్షంలో.. ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తుందని సమాచారం.

ఎంపీ నిధులతో ఇంటింటికీ తాగునీరు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు

– మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నిధులతో తాగునీటి ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ అందిస్తామని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం రాత్రి రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వెళ్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణం పూర్తి అయ్యిందని, కొన్ని చోట్ల నిధుల సమస్య ఉందని ఎంపీపీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఎంపీ నిధులను మంజూరు చేస్తామని, వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించాలని నాయకులను ఆదేశించారు. అలాగే మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు, బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో వైస్ ఎంపీపీ విజయశేఖర్, సూర్య నారాయణ రెడ్డి, యుగంధర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు పలమనేరు సీఐ



బదిలీ అయిన సీఐ నరసింహరాజు నూతన సీఐ మురళీమోహన్

పలమనేరు: పలమనేరు సీఐ నరసింహరాజును వీఆర్ బదిలీ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నుంచి బుధవారం ఆదేశాలందాయి. ఆయన స్థానంలో గంగవరం రూరల్ సీఐగా ఉన్న మురళీమోహన్ ఇక్కడికి సీఐగా గురువారం విధుల్లో చేరారు. కాగా సౌమ్యుడిగా పేరున్న నరసింహరాజు బదిలీపై పట్టణంలో జోరుగా చర్చ సాగుతోంది. అయితే గతంలో జరిగిన కనగదుర్గ ఫైనాన్స్ మోసం కేసులో కొందరు నిందితులకు ఆయన సాయం చేశారనే విషయం నిఘా వర్గాల ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు వెళ్లిందనే విషయం తెలిసింది. మరోవైపు ఆయన అధికార పార్టీకి పెద్దగా సపోర్ట్ చేయనందుకే బదిలీ జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేదింటి బిడ్డ ప్రతిభ



టీనారాణి

నింద్ర: ఓ పేదింటి బిడ్డ నీట్‌లో ప్రతిభ చూపి, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో సీట్ సాధించింది. ఇటీవల విడుదలైన నీట్‌కు సంబంధించి ప్రస్తుతం ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నింద్ర మండలం కొప్పేడు దళితవాడకు చెందిన చిట్టిబాబు, నిశాంతి దంపతుల కుమార్తె టినారాణి నీట్‌లో 480 మార్కులు సాధించి, 2,368 ర్యాంక్ తెచ్చుకుంది. దీంతో ఆమెకు ప్రస్తుతం జరుగుతున్న కౌన్సెలింగ్‌లో తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. దీంతో ఆ విద్యార్థిని పలువురు ప్రశంసించారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో?

డీఎస్సీ.. ఇది జిల్లాస్థాయికే పరిమితం.. అయితే ప్రస్తుత డీఎస్సీ రాష్ట్రస్థాయిలో సాగుతోంది. జిల్లాస్థాయిలో పారదర్శకంగా సాగాల్సిన ఈ ప్రక్రియను కూటమి సర్కారు పక్కదారి పట్టిస్తోంది. ఫలితంగా ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో తెలియక, అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఫలితంగా వారు అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఆందోళన చెందాల్సి వస్తోంది.

అంతా గందరగోళమే

- పేరుకే డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ
- తుది సెలక్షన్ జాబితా వెల్లడించకుండా పరిశీలన
- లోగుట్టు రహస్యాలపై పలు అనుమానాలు
- 1,478 మందికిగాను 1,099 మందికే కాల్‌లెటర్లు
- కొంత మందికి కాల్‌లెటర్లు, మరికొంత మందికి మెసేజ్‌లు
- మెగా డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల పెదవి విరుపు



ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్‌ల పరిశీలనకు విచ్చేసిన డీఎస్సీ అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో గందరగోళం నెలకుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై డీఎస్సీ అభ్యర్థుల్లో పలు అనుమానాలు నెలకొన్నాయి. పారదర్శకంగా నిర్వహించాల్సిన డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ప్రక్రియ మొత్తం రాష్ట్ర స్థాయిలో రహస్యంగా చేపడుతూ పలు అనుమానాలకు తావిస్తోంది. డీఎస్సీ అంటే డిస్టిక్ సెలక్షన్ కమిటీ. జిల్లాస్థాయి కమిటీలో చేపట్టాల్సిన ఎంపిక ప్రక్రియను కూటమి ప్రభుత్వం రహస్యంగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది. ఎన్నో ఏళ్లగా సాగుతున్న డీఎస్సీ ప్రక్రియ నిబంధనలకు ప్రస్తుతం తూట్లు పొడిచింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెగా డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ పరీక్షలు రాసి ఎంపికైన అభ్యర్థులకు గురువారం సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రక్రియను చిత్తూరు జిల్లా కేంద్రం సరిహద్దులో ఉన్న అపోలో యూనివర్సిటీ, ఆర్‌వీఎస్ నగర్‌లో ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ ప్రక్రియ గురువారం రాత్రి వరకు 50 శాతం పూర్తి కాని పరిస్థితి నెలకొంది.

మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ

కూటమి ప్రభుత్వం చేపట్టింది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని విద్యావేత్తలు, అభ్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. డీఎస్సీ అంటేనే డిస్టిక్ట్ సెలక్షన్ కమిటీ అని అర్థం ఉంది. అయితే ఆ అర్థానికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు పలికింది. జిల్లా స్థాయిలో కమిటీగా ఏర్పడి నిర్వహించాల్సిన ఎంపిక ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తోంది. ఎన్నడూ ఇలా జరగలేదని అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్ర స్థాయిలో జాబితాలు మొత్తం సిద్ధం చేస్తుండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నట్లు వాపోతున్నారు. పూర్తిస్థాయిలో స్పష్టంగా తుది ఎంపిక జాబితాలు ప్రచురించకపోవడంపై అంతర్యమేమిటో తెలియజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కూటమికి అనుకూలమైన అభ్యర్థులకు న్యాయం చేసేందుకు ఇలాంటి లోగుట్టు ప్రక్రియ చేపడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

1,478 మందికి గాను 1,099 మందికే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 1,478 మందికి గాను 1,099 మందికి మాత్రమే కాల్‌లెటర్లు పంపి గురువారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. సర్టిఫికెట్ల పరిశీలన చేసుకున్నంత మాత్రం ఉద్యోగం వచ్చినట్టు కాదనే మెలిక పెట్టారు. అలాగే తుది ఎంపిక జాబితాను ప్రచురించకపోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. 379 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు రాక పోవడంతో ఆందోళనతో సర్టిఫికెట్ పరిశీలన కేంద్రాలకు విచ్చేశారు. అనంతరం మిగిలిన 379 మందికి త్వరలో కాల్‌లెటర్లు పంపుతారని అధికారులు సమాధానమిచ్చారు. సాయంత్రం వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాసి అభ్యర్థులు చేసేదేమి లేక వెనుదిరిగారు. కొంత మందికి కాల్‌లెటర్లు, మరికొంత మందికి మెసేజ్‌లు పంపడంతో గందరగోళం నెలకుంది.

అర్ధరాత్రి వరకు పడిగాపులు

కూటమి ప్రభుత్వం అలసత్వ వైఖరితో డీఎస్సీ అభ్యర్థులు గురువారం పరిశీలన కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ముందస్తుగా సెలక్షన్ జాబితాను పారదర్శకంగా ప్రచురించి సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సింది పోయి ఎలాంటి జాబితా ప్రచురించకుండా పరిశీలన చేపట్టారు. ఇదేమిటని పలువురు సంఘ నేతలు రాష్ట్ర విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఇందుకు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలన ప్రక్రియ తాత్కాలికం మాత్రమేనని చెప్పడం కొసమెరుపు. గతంలో ఎంపిక జాబితాను పత్రికలకు వెల్లడించేవారు. అయితే ప్రస్తుతం అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లకే పంపి గందరగోళానికి తెరలేపారు. గురువారం సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాల్లో పలు సమస్యలు చోటు చేసుకున్నాయి. చిన్న చిన్న తప్పిదాలు, అవగాహన లేక కొంత మంది అభ్యర్థులు అర్హులైనప్పటికీ తప్పుగా ఒక సర్టిఫికెట్ బదులు మరో సర్టిఫికెట్ అప్‌లోడ్ చేశారు. అటువంటి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే జిల్లా అధికారులు పరిష్కారం తమ చేతుల్లో లేదని చేతులెత్తేశారు. సర్వర్ మొరాయింపుతో గురువారం రాత్రి 8 గంటల వరకు 51 శాతమే పరిశీలన పూర్తి అయ్యింది. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగే పరిస్థితి ఉండడంతో దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన అభ్యర్థులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

ట్రాన్స్‌కో ఎస్‌ఈగా నరేంద్రనాథ్

– మరో ఐదు రోజుల్లో ఉద్యోగ విరమణ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఎస్‌ఈగా నరేంద్రనాథ్ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఈయన మరో ఐదు రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. విద్యుత్‌శాఖలో పలుకుబడి ఉంటే ఏదైనా జరుగుతుందని అనడానికి పలు ఉదాహరణలు కనిపిస్తున్నాయి. ఎటువంటి మద్దతు లేకపోతే కనీసం లైన్‌మెన్ బదిలీకి కూడా నానా తిప్పలు పడాల్సిందే. అదే పలుకుబడి ఉంటే ఉద్యోగ విరమణ ఐదు రోజుల ముందు కూడ ఎస్‌ఈగా బాధ్యతలు తీసుకొవచ్చని నిరూపితమైంది. జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈగా నరేంద్రనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 31వ తేదీన ఆయన ఉద్యోగవిరమణ చేయనున్నారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయ కమర్షియల్ విభాగం జీఎంగా ఉన్న ఆయనకు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఈగా రిటైర్డ్ కావాలనే ఆశను తీర్చుకున్నట్లు తెలుస్తోంది. తన పలుకుబడితో సీఎండీపై ఒత్తిడి తీసుకొచ్చి పని చేసుకున్నారని పలువురు అధికారులు ఆరోపిస్తున్నారు. ఇందుకోసం గతంలో ఎస్‌ఈగా ఉన్న ఇస్మాయిల్‌అహ్మద్‌ను సెలవుపై పంపి.. ఆ స్థానాన్ని ఖాళీగా చూపి నరేంద్రనాథ్‌ను నియమించారని వాదనలు వినిపిస్తోంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నరేంద్రనాథ్ ఈ నెల 31వ తేదీ వరకు సీఎం కుప్పం పర్యటన కార్యక్రమంలో గడపనున్నారు. తరువాత ఉద్యోగ విరమణ చేయనున్నారు. గతంలోను కర్నూలు ఎమ్మిగనూరు ఈఈగా ఉన్న బాబ్రూవాహన్ ఉద్యోగ విరమణ మూడురోజుల ముందు ఆగమేఘాల మీద చిత్తూరు ఈఈగా బదిలీ చేయించుకుని ఇక్కడ ఉద్యోగ విరమణ చేశారు. చిత్తూరు జిల్లాలో అధికారులను సెలవుపై పంపి ఉద్యోగ విరమణ చేస్తున్న తతంగంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాడుతాం

– స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అమరువీరుల స్ఫూర్తితో ముందుకు వెళదామని సీపీఐ, సీపీఎం నాయకులు తెలిపారు. గురువారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులనివార్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీల జిల్లా కార్యదర్శులు నాగరాజు, గంగరాజు మాట్లాడారు. గతంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ నివాళులర్పించారు. పోరాట స్ఫూర్తితో నేటి విద్యుత్ భారాలకు, స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, కుమారి, విజయ, ఆనంద్, శివకుమార్, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శిగా కె రాజన్

కార్వేటినగరం : చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చెందిన కె రాజన్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శిగా గురువారం నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

కాణిపాకంలో సేవ్ వాటర్-సేవ్ ట్రీ సైకిల్ ర్యాలీ

కాణిపాకం: సేవ్ వాటర్– సేవ్ ట్రీ అనే నినాదంతో హైదరాబాద్‌కు చెందిన మహేష్ చేపట్టిన సైకిల్ ర్యాలీ గురువారం కాణిపాకం గ్రామానికి చేరింది. ఈయన ఏడాది నుంచి ఈ ర్యాలీ చేపడుతున్నాడు. దేశవ్యాప్తంగా చేయనున్న ఈ సైకిల్ ర్యాలీలో భాగంగా ఇప్పటివరకు 15 వేల కిలోమీటర్లు ర్యాలీ చేసి, హెల్త్ ఈజ్ వెల్త్ అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానని ఆయన తెలిపారు. వరసిద్ధివినాయక స్వామివారిని దర్శించుకుని, తమిళనాడుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

త్వరలోనే బుద్ధి చెప్పేరోజులొస్తాయి

- మిథున్‌రెడ్డి విడుదల కావాలని వీరాంజనేయస్వామి, శివాలయంలో పూజలు
- 301 టెంకాయలుకొట్టి పెద్దిరెడ్డి పేరిట అర్చన
- అధికసంఖ్యలో పూజలకు హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కరణంవారిపల్లెలో కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెప్పే రోజులొస్తాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ హెచ్చరించారు. గురువారం వైఎస్సార్ సీపీ కాగతి పంచాయతీ నేతల ఆధ్వర్యంలో కరణంవారిపల్లె వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో అక్రమ కేసు నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు చేశారు. 301 టెంకాయలు కొట్టి వీరాంజనేయా.. పెద్దిరెడ్డి కుటుంబానికి అభయమివ్వు అయ్యా.. కూటమి కుట్రలదారులకు మంచి బుద్ధి ప్రసాదించయ్యా అంటూ వేడుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పేరిట అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆడెం హరిబాబు, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షులు వెంకటరమణ, లడ్డూ రమణ, అమర, సర్పంచ్ షంషీర్, డీసీసీబీ మాజీ డైరక్టర్ రమేష్, నాయకులు గంపల రామకృష్ణ, నారాయణరెడ్డి, నరేష్, గిరిబాబు, గణేష్, చెంగారెడ్డి, గంగిరెడ్డి, చిన్నప్ప, రాజారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మండలకేంద్రంలోని బజారువీధిలో ఉన్న అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, పార్టీ నేతలతో కలిసి మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని కోరుతూ పూజలు చేయించి ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి, ఎల్లో మీడియా ద్వారా కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, పవన్, హరీష్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

పుత్తూరు: స్థానిక ధర్మరాజుల ఆలయం ఎదురుగా గురువారం ఉదయం రైల్వే ట్రాక్ దాటుతున్న వృద్ధుడ్ని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. పుత్తూరు జీఆర్పీ కానిస్టేబుల్ శివకుమార్ కథనం మేరకు.. స్థానిక గేట్‌పుత్తూరు శీలకారువీధికి చెందిన ఆర్.రాజు(68) టీ తాగేందుకు వచ్చి ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శివకుమార్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన రుక్మాంగద (47) అనే వ్యక్తి బుధవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. కొంగారెడ్డిపల్లెకు చెందిన రుక్మాంగద చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ మద్యం దుకాణం సమీపంలో అచేతనంగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రుక్మాంద మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఈ ఘటనపై అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మహేశ్వర తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పూతలపట్టు(యాదమరి): అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బూసిపల్లి గ్రామానికి చెందిన మునిరత్నం(34) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన అతని కుటుంబ సభ్యులు అతడిని పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుంగనూరు: మండంలోని రెడ్డివారిబావి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని సింగిరిగుంట గ్రామానికి చెందిన బోయకొండప్ప, అతని భార్య సుజాత(38)దంపతులు ద్విచక్రవాహనంపై పారుగు ఊరికి బయలుదేరారు. రెడ్డివారిబావి సమీపంలోకి వెళ్లగా సుజాత ద్విచక్రవాహనం నుంచి జారీ కింద పడింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను భర్త, కుటుంబ సభ్యులు తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టా రీల్స్ చూసి వెళ్లిపోయిన బాలిక

చిత్తూరు అర్బన్: సామాజిక మాధ్యమాల్లో వచ్చే వీడియోలను చూసిన ఓ బాలిక ఇంట్లో కుంటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయింది. చిత్తూరు జరిగిన ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరుకు చెందిన 16 ఏళ్ల బాలిక ఇంట్లోని తన కుటుంబ సభ్యుల మొబైల్ ఫోన్ తీసుకుని తరచూ ఇన్‌స్టాలో రీల్స్ చూసేది. ఈ క్రమంలో ఓ వ్యక్తి చేసే వీడియోలు చూస్తూ అతనితో ఇన్‌స్టాలో పరిచయం పెంచుకుంది. బుధవారం బాలిక కనిపించకుండాపోయింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫోన్ పరిశీలించిన సీఐ.. ఇన్‌స్టాలో ఉన్న మెసేజ్‌ల ఆధారంగా బాలిక, కర్ణాటకకు చెందిన ఇన్‌స్టా పరిచయస్తుడి వద్దకు వెళ్లినట్లు గుర్తించారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మద్యం విక్రయం కేసులో వ్యక్తి అరెస్టు

చిత్తూరు అర్బన్: కర్ణాటకకు చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీఎల్) మద్యం విక్రయిస్తున్న శివ (32) అనే వ్యక్తిని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు గురువారం చేశారు. చిత్తూరు నగరంలోని ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 60 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు లభించాయి. నిందితుడు తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆర్‌కె.పేటకు చెందిన శివగా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహేశ్వర తెలిపారు.

పెళ్లి సంబంధం చూడడానికి వెళుతూ..



కారులో మృతి చెందిన నాగేంద్ర, కల్వర్టులో సుబ్బారాయుడు మృతదేహం, క్షతగాత్రులను తరలిస్తున్న 108 సిబ్బంది

- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- తండ్రీకుమారులు మృతి
- మరో ముగ్గురుకి తీవ్ర గాయాలు

పూతలపట్టు(యాదమరి): కుమారునికి వివాహం సంబంధం చూడటానికి వెళుతున్న తండ్రీకుమారులను మృత్యుదేవత రోడ్డు ప్రమాదం రూపంలో పంజా విసిరిన ఘటన పూతలపట్టులో చోటుచేసుకుంది. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన సుబ్బారాయుడు(60) కుటుంబం చాలా సంవత్సరాల క్రితమే వ్యాపారరీత్యా బెంగళూరు నగరంలో స్థిరపడింది. అయితే తన కుమారుడు నాగేంద్ర(30)కు వివాహం చేయాలన్న ఆలోచనతో పెళ్లి సంబంధాలు చూసే ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో తమ స్వస్థలమైన నెల్లూరు కు సుబ్బరాయుడితోపాటు ఆయన భార్య మంగమ్మ(56), కుమారుడు నాగేంద్ర(30), కుమార్తె సుభాషిణి(36), మనుమడు లక్కి(7)తో కలిసి గురువారం ఉదయం బెంగళూరు నుంచి ఎర్టిగా కారులో బయలుదేరారు. కారు నడుపుతున్న నాగేంద్ర నిద్రమత్తులోకి జారుకోవడవంతో తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిలోని పూతలపట్టు మండలం గోపాలపురం సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాల డెయిరీ వద్ద కల్వర్టును ఢీ కొన్నారు. కారు నడుపుతున్న నాగేంద్ర, పక్కసీటులో ఉన్న అతడి తండ్రి సుబ్బారాయుడు కల్వర్టు కింద పడి మరణించారు. కారు వెనుక భాగంలో కూర్చున్న సుబ్బారాయుడు భార్య, కూతురు, మనుమడు తీవ్రగాయాల పాలయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కృష్ణమోహన్ బృందం వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని వాహనం నుంచి బయటకు తీసి 108 వాహనంలో పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సుభాషిణి ఆస్పత్రిలో తన తండ్రి, తమ్ముడికి ఏమైంది.. వారెక్కడ అని రోదిస్తూ అడగడం పలువురిని కంటతడి పెట్టించింది. మృతులను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ కృష్ణమోహన్ అన్నారు.

వరసిద్ధుడి సన్నిధిలో ప్రముఖులు



రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామివారిని బుధ, గురువారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఐజీ నవీన్‌చంద్, ఒడిశా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురహరి శ్రీరామన్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి సవిత, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ఆలయ మర్యాదలు చేశారు. స్వామివారి ప్రసాదం చేశారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

వడమాలపేట (పుత్తూరు): దారికి అడ్డుగా వచ్చిన ఆవును తప్పించబోయిన కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం సాయంత్రం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురంలో చోటు చేసుకొంది. ఈ విషయం గమనించిన గ్రామస్తులు వెంటనే కారులోని వారిని రక్షించారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో కారును వెలుపలికి తీశారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

వ్యర్థం విస్మరిస్తే విషం



ప్రకృతి సమతుల్యంగా ఉంటేనే మనుగడ సాధ్యం. గతంలో మన పూర్వీకులందరూ ప్రకృతితో మమేకమై జీవించేవారు. ప్రస్తుతం మనమంతా ప్రకృతిని కలుషితం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఇలాగే కొనసాగితే ముమ్ముందు మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. గాలి, భూమి, నీరు.. అన్నింటా కలుషితం పెరిగిపోతున్నాయనడానికి చిత్తూరు మండలం అనంతాపురంలోని ఓ ఫ్యాక్టరీ నుంచి వర్షం కురిసిన ప్రతిసారీ వదులుతున్న వ్యర్థాలే నిదర్శనం. నీలి రంగులోని ఈ వ్యర్థాలు వర్షపు నీరు సైతం మారుతోంది. అధికారులు స్పందించి వ్యర్థాల కట్టడికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. - చిత్తూరు రూరల్(కాణిపాకం)